# జవాబు లేని ?

[redacted]

మా అక్కయ్య కొడుకు పెళ్ళికని కాకినాడ ఎయల్దేరేం. అక్కణ్ణుంచి అన్నవరం వెళ్ళాలి. నాంపల్లిలో గోదావరి ఎక్స్‌ప్రెస్ ఎక్కాం. నేను, మా అక్కయ్య, మా వారు, మా అక్కయ్య కొడుకు గోపాల్, మా అక్కయ్య కూతురు పద్మజ, మ బావగారు ఇక్కణ్ణుంచి బయల్దేరేం.

సికింద్రాబాదులో అనుకోకుండా ఏదో మెడికల్ కాన్ఫరెన్సుకొచ్చిన మా మరిది ముత్తు కలిసేరు. అందరం సరదాగా కబుర్లు చెప్పకుంటూ వరంగల్ దాక వచ్చేసేం. తొమ్మిది గంటలవుతుందేమో! అందరూ తాము తెచ్చుకున్న టిఫిన్స్ తినడం ప్రారంభించేరు. కొందరు క్రిందకి దిగారు. మా కంపార్టుమెంటు ఇంజనుకి దగ్గరగా వుండటంవలన స్టేషన్‌కిదూరంగావుంది. అక్కడ లైటింగు కూడ సరిగ్గాలేదు. కొందరప్పుడే కొంపలంటుకున్నట్లుగా అర్జంట్‌గాబెర్త్‌కి పెట్టిన రిజర్వేషను ఛార్జీలుదండగవుతాయన్నట్లుగా ఎక్కి పడుకుంటున్నారు.

మేం టిఫిన్ చేస్తూ మా ముత్తు మాటల్ని ఎంజాయ్ చేస్తున్నాం. ముత్తుంటే సందడికి లోటుండదు. మాటల ఖని అతను. మేం నవ్వుకుంటుండగా మా పై బెర్త్‌పై వ్యక్తి "దొంగ దొంగ, పట్టుకోండి" అని అరవడం విని ఉలిక్కిపడి టిఫిన్స్ వదిలేసి లేచి నిలబడ్డాం.

బెర్త్‌మీద వ్యక్తి అలా అరవగానే సూట్‌కేసు పట్టుకొని నిదానంగా, హుందాగా ప్రయాణీకుడిలాదిగబోతున్న ఒక వ్యక్తి కంగారుగా పరిగెట్టబోయాడు.

వెంటనే మా అక్క కొడుకు గోపాల్, మా ముత్తు, మా వారు చిరంజీవి, సుమన్‌లా పరిగెత్తి అతనికి కాళ్ళడ్డం పెట్టి పడగొట్టి సూట్‌కేసు లాక్కున్నారు. పారిపోబోతున్న అతన్ని మా మరిది గట్టిగా పట్టుకున్నాడు. సూట్‌కేసు, సూట్‌కేసు వ్యక్తికి అప్పగించారు. ఇంతలో కంపార్టుమెంటులోని ప్రయాణీకులు అతన్నిచూసి తిరిగి తమ సీట్లకొచ్చి వ్యాఖ్యానాలు ప్రారంభించేరు.

చూడ్డానికి నీటుగా దొరబాబులా వున్నాడని ఒకరంటే, ఇంకతకంటే మరేం పని దొరకలేదు 'కాబోలు అని మరొకరు రకరకాలుగా లోకరీతి గురించి మాట్లాడుకుంటున్నారు.

"చంపండి వెధవని! పొడవండి!" అంటూ అరచాడు సూట్‌కేసు సొంతదారు.

ఆ మాటలకి ఆవేశం వచ్చిన మా ముత్తు చెయ్యి చేసుకోబోతే మా అక్కయ్య వారించింది.

ఇంతలో టి.సి. వచ్చాడు. అతనికి సంగతి చెప్పేరు మా వాళ్ళు. అతను చాల పరధ్యానంగా విని దొంగని ప్లాట్ ఫారమ్మీదకు తీసుకెళ్ళేరు. కూడ మావాళ్ళు కూడ వెళ్ళేరు. దొంగని ఏదో ఫార్మలిటీకి మందలించినట్లు మందలించి గబుక్కున వదిలేసేడు టి.సి. అతను అదే అదనుగా పారిపోయాడు. దాంతో మా వాళ్ళకి ఆవేశం పెరిగిపోయి టి.సి.మీద తిరగబడ్డారు. మా ముత్తు, గోపాల్ దొంగని పట్టుకోవాలని పరిగెత్తేరు.

ఏదో క్రాసింగ్ వుండటాన ట్రెయినక్కడ చాల సేపు నిలబడిపోయింది.

మా వాళ్ల జాడలేదు. మాకు ఆందోళన హెచ్చయింది. ఎన్నో రకాలుగా, సమాజాన్ని, న్యాయాన్ని, ధర్మాన్ని గురించి మాట్లాడిన ఒక్కరు కూడ మా వాళ్ళ గురించి రైలుదిగి కనుక్కోడానికి ఇష్టపడలేదు. ఒకతను తెగించి వెళ్ళబోయినా "మాయదారి పీడ! మీకెందుకండి! వాళ్ళ దగ్గర కత్తులుంటాయి! గబుక్కున పొడిస్తే ఏం చేస్తాం!" అంటూ వెళ్ళకుండా వారించింది అతని భార్య.

మేం నిస్సహాయంగా నిలబడిపోయేం.

చివరికి మా అక్కయ్య సూట్‌కేసు ఓనరునిరిక్వెస్టు చెయ్యాలని అతని బెర్త్‌దగ్గరకి వెళ్ళింది. అతనప్పటికే గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు. ఎంత పిలిచినా ప్రయోజనం లేకపోయింది.

చివరికి రైలు కదలబోతుండగా మావాళ్ళు వచ్చారు. వాళ్ళని చూడగానే మా ఆత్రుత కోపంగా మారింది. "అసలు సూట్‌కేసు పోగొట్టుకున్న మనిషిగుర్రుపెట్టి కలలు కంటున్నాడు. మీకెందుకింత ఆవేశం! చూసి రమ్మంటే కాల్చిరావడం ఇదే!" అంటూ కోప్పడింది మా అక్కయ్య.

"ఆ టి.సి. చూశారా వదినా! పట్టుకున్నదొంగని వదిలేశాడు. వీళ్ళకి ట్రైన్స్‌తెఫ్ట్స్ వాటాలుంటాయట! ఎంత మోసమో చూడండి! చదువుకున్న వాళ్ళే ఇలా అడ్డదారులు పడుతుంటే ఈ దేశం ఎలా బాగుపడుతుంది!" అంటూ వాపోయేడు మా ముత్తు.

"ఏదో ఒకటిలే సింగినాదం! వాడివెంట అలా పరిగెత్తి వెళ్ళేరు. వాడేమైనా పొడిస్తే ఏం దిక్కు మనకి!" అంటూ మందలించింది మా అక్కయ్య.

నేను మాత్రం ఆలోచిస్తూ వుండిపోయాను.

కొన్నిపరిస్థితులు దొంగల్ని తయారు చెయ్యవచ్చు! కొందరు స్వార్థపరులు వాళ్ళతో చేతులు కలపొచ్చు. కొందరు అవకాశవాదులు తమకెందుకని తప్పుకోవచ్చు! కాని... సహాయం అందుకొని, తనకి సహాయపడిన వ్యక్తుల గురించి ఒక్కక్షణం కూడా ఆలోచించకుండా నిశ్చింతగా నిద్రపోగల సూట్‌కేసు ఓనర్‌లాంటి వ్యక్తుల్ని ఏమని పిలవాలి? స్వార్థం అనే చిన్న పదంలో ఈ జాతి ఇముడుతుందా?

ఇప్పటికీ నాకు జవాబు దొరకని ప్రశ్న!

